# అసమర్థని సమర్థత!

## కందుకూరి. వెంకట మహాలక్ష్మి

గోడమున్న గడియారం టిక్, టిక్, టిక్‌మని శబ్దం చేస్తూ నిశ్శబ్దాన్ని భంగపరుస్తోంది అది తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వహిస్తున్నట్లు నిమిషాల ముల్లు గంటల ముల్లు అనే తన రెండు కాళ్ళతో కాలాన్ని ముందుకు నడిపించుకు పోతోంది

నిద్రపట్టని సుందర్రామయ్యగారు పడక్కుర్చీలో పడుకుని ఆ గడియారంవైపే చూడసాగాడు అది పాతకాలపు గడియారం రంగుపోయి అక్కడా, అక్కడా పెచ్చులూడిపోయి వుంది. తండ్రి ఆయన కిచ్చిన ఆస్తిలో భాగమది మెల్లి మెల్లిగా తండ్రి ఆయనకిచ్చిన ఆస్తంతా హారతి కర్పూరంలా హరించుకుపోయింది ఆఖరికి ఇంట్లో సామానుతో బాటు భార్యవంటిమీద నగలుకూడా తరిగి, తరిగి ఆఖరికి ఇంట్లోముఖ్యావసర వస్తువులు, భార్య వంటి మీద పుస్తెలతాడు ౬ గాజులజత మాత్రం మిగిలాయి ఏదివున్నా ఏదిపోయిన ఈ గడియారం మాత్రం సుందర్రామయ్యని వదల్లేదనేకన్నా, సుందర్రామయ్యే దాన్ని వదలకుండా అద్దెకొంపలోకి తెచ్చుకున్నాడంటే సమంజసమేమో! అంతేకాకుండా దాన్ని ఎంతో అపురూపంగా చూచుకుంటున్నాడు.

అశాంతితో మనస్సంతా చికాగ్గా వున్న సుందర్రామయ్యగారికీనాడు ఆ గడియారమంటే విసుగ్గాను దాని టిక్, టిక్‌శబ్దం కర్ణ కఠోరంగాను వుండి, చిరాగ్గా దానివైపు చూసాడు

"ఛీ—ఛీ — నువ్వే నా జీవితాన్నిలా సర్వ నాశనం చేసావు కొంప మునిగిపోయినట్లు, కొంప లంటుకుపోయినట్లు, ఎవరో తరుముకొస్తున్నట్లు నువ్వు పరిగెత్తి నా బాల్యాన్ని, నన్ను పరిగెత్తించి నా జీవితాన్ని సర్వనాశనం చేసావు పోనీ! సరే— ఒక్కసారి మళ్ళీ వెనక్కి పరిగెత్తి నా బాల్యాన్ని ఆ ఆనందాన్ని వెనక్కి తెప్పించు చూద్దాం! నేను పుట్టక మునుపునుంచీ నా ఇంట్లో వున్నావు నీ వయస్సెంతో నాకు తెలీదు మా నాన్న నిన్ను నా కిచ్చాడు నిన్నెంతో పదిలంగా దాచుకుని, మా నాన్నని చూసుకున్నంత ప్రేమగా చూసుకున్నాను ఫలితంగా నాకేమిచ్చావు? మా నాన్న నా కప్పగించిపోయిన దగ్గర నుంచీ నువ్వు నడిపిన ప్రతీ సెకనులో కష్టాలే తప్ప సుఖాన్నిచూపించావా? నా కష్టాలని చూసినవాళ్ళూ, విన్నవాళ్ళూ "బెడ్డ్‌టైమండీ! మంచికాలం రాకపోదు" అనిజాలిపడ్డారు ఆ బెడ్డ్‌టైము నీ ముళ్ళతోటే నడిపించావు మంచి కాలమెలాగుంటుందో ఒక్క నిమిషంపాటన్నా చూపించావా?

ఇంటికి పెద్దవాడిని, పైగా బ్రతకలేని బడిపంతుల్ని నాన్న పోయాకా ఇద్దరి చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు తాహతుకి మించి చేసాను దాంతో నాన్నిచ్చిన నాలుగెకరాల్లో రెండెకరాలు హరించుకు పోయాయి అప్పటికే తనకి ౬ కొడుకు, ఇద్దరాడ పిల్లలు పెద్దపిల్లకి బి ఏ చెప్పించి, పెళ్ళి చెయ్యడానికి, కొడుక్కి బి కాం చెప్పించడానికి మిగిలివున్న రెండెకరాలూ అమ్మినా చాలకపోవడంతో ఇల్లు తాకట్టుపెట్టి, విడిపించుకోలేక, తాకట్టు వాకట్టయి చెల్లయిపోయింది

బి కాం పాసయిన కొడుకు నాలుగురాళ్ళు సంపాదించి వేణ్ణీళ్ళకి చన్నీళ్ళు తోడైనట్లు తోడవుతాడనుకుంటే, పాసయి నాలుగేళ్ళయినా ఉద్యోగం దొరక్క తిరిగిన జాగాకే తిరిగి, పెట్టిన దానికే అప్లికేషన్లు పెట్టి, పోస్టల్ ఆర్డర్లకీ, ప్రయాణాలకే ఇప్పటికి బోల్డు ఖర్చు చేసాడు ఆ అప్పులు తీర్చడానికి భార్య వంటిమీద నగలు, ఇంట్లో విలువైన సామాన్లూ కాళ్ళొచ్చి నడిచిపోయినట్లు పోతుంటే ఉసూరుమంటూ బాధపడటం తప్ప ఏమీ చెయ్యలేక పోయాను

ఏం నా బాధలు నీకు అర్థంకావా? నా ఇంటిని మంచికాలంతో కలకల్లాడించకూడదూ? వెధవబుద్ధి కాకపోతే!" అంటూ చీదరింపుగా దాన్ని చూసి తుపుక్కున ఉమ్మేసాడు.

కాఫీ గ్లాసిచ్చి లోపలికెళ్తున్న జానకివైపు చూసాడు జానకి తన రెండో కూతురు పెళ్ళి కెదిగి గుండెలమీద కుంపటిలా కూర్చుంది ప్రయివేటుగా బియ్యేకి కట్టి పాసయి రెండేళ్ళయింది అప్పటినుంచి పెళ్ళివారొస్తున్నారు, చూస్తున్నారు, వెళ్తున్నారు. వాళ్ళకి పిల్ల నచ్చినా కట్నం నచ్చటం లేదు. వారికి నచ్చిన కట్నం ఇచ్చే స్తోమత తనకి లేదు ఈసారి అమ్మడానికి ఏమీ మిగల్లేదు దాంతో పెళ్ళి చెయ్యడమే తనకి పెద్ద సమస్యయికూర్చుంటే ఇంక కట్నమెక్కడినుంచి తెస్తాడు!? ఇప్పుడు తనకొచ్చే బడిపంతులు జీతంమీదే అతికష్టంగా ఇల్లు గడుస్తోంది.

"అసలు నేను అనుకున్నది ఏమిటి? అయిందేమిటి? పెద్దపిల్ల పెళ్ళికి, వీడి చదువుకి భూమి ఇల్లు ఖర్చుచేసినా, మధు చేతికందొచ్చి గడించడం మొదలెడతాడు, వాడి ఆసరాతో జానకి పెళ్ళి చేసెయ్యొచ్చు — అనుకున్నాను కానీ విధి వక్రించింది ఆడపిల్ల పెళ్ళికయినంత ఖర్చుకంటే ఎక్కువే మధుకీ అవుతోంది తేడా అల్లా ఆడపిల్ల పెళ్ళికి ఒక్కసారి గుమ్మరించాలి వీడికి అప్పుడప్పుడు ఖర్చు పెడుతున్నాడు ఇదంతా రాణించని ఖర్చయింది"

కొడుకు ఇన్‌టర్‌వ్యూల కెళ్ళొచ్చి నిరుత్సాహంగా కూర్చుంటాడు "ఏరా బాబూ! ఏమయింది" అంటే "మినిస్టర్ రికమెండేషన్‌మీద ముందే ఆ ఉద్యోగం ఫలానావాడి కెళ్ళిం"దనో, లేక "వాడెవడో లంచమిచ్చి తన కొడుక్కి వేయించుకున్నా"డనో, లేక "అగ్రకులంవాడినని నాకు ఇవ్వలే"దనో చెప్పినప్పుడు దోషిలా తలదించుకోవడం తప్ప ఏమీ చెయ్యలేకపోయేవాడు "నిజమే తనకి లంచం పెట్టడానికి డబ్బూలేదు, రికమెండ్ చేయించాలంటే పరపతీలేదు తనో సాధారణ బడిపంతులు ప్రతీ విద్యార్థి భవిష్యత్‌కి పునాది వేసేది తమ ఉద్యోగాలే! అయినా తనింటి పునాదిమీద పాకయినా వెయ్యలేని అసమర్థవంతమైన ఉద్యోగం తనది పై క్లాసుల కెళ్ళగానే ఈ మేష్టారిని మర్చిపోతుందీ విద్యార్థి లోకం ఆఫ్టరాల్ తనెంత? తన ఉద్యోగమెంత? ఎవరినెళ్ళి అర్థిస్తే తన కొడుక్కి ఉద్యోగమొస్తుంది? అయినా ఏం చెప్పుకుని వెళ్ళి "నా కొడుక్కి ఉద్యోగమివ్వ"మని అడగడం?

నిజానికి తనడిగిన ప్రశ్నకి కొడుకిచ్చింది జవాబే అయినా, ఎందుకో ఆ జవాబు తన అసమర్థతని ఎత్తిచూపి "నాన్నా ఇందులో నువ్వేమీ చెయ్యలేనప్పుడు ఎందుకీ ప్రశ్న?" అన్న భావం కూడా వుందనిపించింది తనకి"

"పోస్టు" అన్నకేకతో వెళ్ళి ఉత్తరాన్నందుకుని వచ్చాడు కవరు చింపి, కళ్ళజోడు సరిచేసుకుని చదవసాగాడు అందులోని సారాంశమిది—

"మీ అమ్మాయి మాకు నచ్చింది ఇక కట్న, కానుకల విషయం — మా అబ్బాయికి పదివేలదాకా ఇస్తామని వస్తున్నారు కాబట్టి మీరు కనీసం అన్నీ కలిపి ఎనిమిది వేలన్నా ఇస్తే మీ పిల్లని చేసుకోవడానికి అభ్యంతరం లేదు—"

ఇది భార్యకి చెప్పినప్పుడు "అవునండీ! ఆ మాత్రం ఇవ్వకపోతే ఎవరు చేసుకుంటారీ రోజుల్లో" అంది "మరి పెళ్ళికో" అన్నాడు నసుగుతూ "ఏ అప్పో, సొప్పో చేసి చేసెయ్యాలిగాని, ఎన్నాళ్ళిలా ఎదిగిన పిల్లనింట్లో వుంచుకుంటాం! ఏ పెళ్ళివారు చూసెళ్ళినా ఇదే రాస్తున్నారాయె! ఇంకా వయసు ముదిరితే అసలు పెళ్ళే అవదేమో!" అంది నెమ్మదిగానే కానీ ఎందుకో ఆమె మాటల్లో తన చాతకానితనాన్ని, అశక్తతని ఎత్తి చూపించిన తీరు బాధించి మరేం అనలేక పడక్కుర్చీ వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు

కళ్ళు మూసుకున్నంత మాత్రాన మనసులోని

ఆవేదనని, ఆందోళనని ఎక్కడికి పారద్రోలగలడు? కుమ్మరి పురుగులా మనసుని తొలిచేస్తున్నాయి ఆలోచనలు. "తనకెవరంత డబ్బు అప్పిస్తారు? ఏం చూసి ఇస్తారు? పార్వతికివేం పట్టవేం! ఆమెకి మాత్రం తెలీదూ?" అని బాధపడసాగాడు.

"ఈ పెళ్ళి వారు చూపులకి రావడానికి ముందు జానకన్న మాటలు పదే, పదే గుర్తొస్తున్నాయి "ఎందుకమ్మా ఈ పెళ్ళిచూపులు? ఇప్పటికి ఎందరి ఎదుట ఖైదీలా నిలబడ్డాను! బోనులో నిలబెట్టిన జంతువుని చూసినట్లు చూసి, ఇష్టమొచ్చినట్లు వేసే వెర్రి,మొర్రి ప్రశ్నలన్నింటికీ ఆత్మాభిమానాన్ని చంపుకుని జవాబుచెప్పలేక విసుగొస్తోంది వచ్చిన ప్రతీవాళ్ళకి నేను నచ్చడంకన్నా కట్నమే ముఖ్యమవుతోంది, అలాంటప్పుడు వాళ్ళ అభిప్రాయాలు ముందే తెల్సుకుని ఆ కట్నం ఇవ్వగలిగితేనే పెళ్ళి చూపులకి రమ్మంటే బాగుండునుకదా" అని అంటోన్న మాటలు పక్కగదిలో వున్న తన చెవుల్లోకి శూలాల్లా దిగాయి.

కూతురన్నదీ నిజమే! కానీ తను ఆశించిందేమిటి? పిల్లనచ్చి కట్నకానుకలు పట్టింపులేదంటూ ఎవడేనా చేసుకుంటే ఓ రెండు మూడువేలు అప్పు తెచ్చి పెళ్ళి చేద్దామనుకున్నాడు కూతురా మాటలాడేదాకా తన తప్పిదాన్ని తెల్సుకోలేకపోయాడు అందుకే ఈ రోజు పెళ్ళాంకూడా సన్న, సన్నగా దెప్పింది "మనదేశంలో పిల్ల నచ్చడం, కుటుంబ సాంప్రదాయంకన్నా ముఖ్యమైనది కట్నమైనప్పుడు, అది చూసుకునే ముందడుగు వెయ్యాలి" తన తెలివి తక్కువ తనానికి తనే సిగ్గుపడ్డాడు

"ఛీ — ఎందుకీ పాడు బ్రతుకు!" అనుకున్నాడు తనమీద తనకే చిరాకువేసి "నిస్వార్థంగా ఈ కుటుంబం కోసం ఇంత కష్టపడుతున్నాడు కానీ ఎవ్వర్నీ సంతోషపెట్టలేకపోతున్నాడు ఇంట్లో అందరి ముఖాల్లో అసంతృప్తి, అందరికీ ఏదో ఓ లోటు జరుగుతోంది దీనికి ముఖ్య కారకుడు తనే! తనవల్లే ఇదంతా — తనుపోతే?"


"అమ్మో! వీళ్ళ గతేమిటి? నే పోతే ఈ సమస్యలకి పరిష్కారాలు దొరుకుతాయా?


దొరకదు! దొరకదు! జానకి పెళ్ళెలా అవుతుంది? ఒకవేళ మధుకి ఉద్యోగమొచ్చినా దాని పెళ్ళి చేస్తాడనేముంది?


"మమ్మల్ని నట్టేట్లోదింపి ఆ ముండా వాడు తన దారి తను చూసుకున్నా"డంటూ తన్ని మరీ తిట్టుకుంటారు తనలాంటి అసమర్థుడు బ్రతికీ ఎవ్వర్నీ సంతోషపెట్టలేడు, చచ్చీ అంతకంటే సుఖపెట్టలేడు" అనుకున్నాడు

గడియారం టంగ్, టంగ్, టంగ్ మంటూ పది గంటల్నికొట్టి భోజనం వేళని గుర్తుచేసింది "కూడు పుట్టించలేని నువ్వు కూటి టైముని గుర్తుచేసి ఆకలి మంటని గుర్తు చెయ్యగల"వని విసుక్కుంటూ నూతి వైపుకి నడిచాడు నీరసంగ

మజ్జిగకని పట్టిన పురిషిట్లోకి అరగరిటెడు మజ్జిగపోసి "అబ్బాయి స్నేహితుడొకడు వాళ్ళాఫీసులో అయిదువేలు సెక్యూరిటీ డిపాజిట్ కడితే వాడికి ఉద్యోగం ఇప్పిస్తానన్నాడుటండీ! ఎవర్నేనా కాస్త అప్పు అడిగి వాడికా ఉద్యోగం వేయించి, జానకికి ఈ






సంబంధమేనా ఖాయం చేసి పెళ్లి చేసెయ్యడం మంచిదండి!'' అని అన్న భార్య మాటలకి తలూపి ఆ మజ్జిగ తాగలేక విస్తట్లో పోసుకుని గబగబా తినేసి లేచెళ్లిపోయాడు

బైటికెళ్లిన సుందర్రామయ్యగారు ఇంటికొచ్చే సరికి చీకటి పడింది

లోపలికొచ్చిన భర్త ముఖంలోకి చూసిన పార్వతమ్మ ఏదో అడగాలనుకుని ఏమీ అడగలేక లోపలికెళ్లిపోయింది సుందర్రామయ్యగారు చాలా ముభావంగా, గంభీరంగా వున్నాడా రోజున ఆ మర్నాడు కూడా ఉదయం భోంచేసి బైటికెళ్లిన మనిషి సాయంకాలం వరకూ తిరిగి రాలేదు

ఆ రాత్రి భోజనాల దగ్గర కూర్చున్న సుందర్రామయ్యగారు భార్యతో ''పెళ్లివారికి శ్రావణ మాసంలో ముహూర్తం పెట్టించమని రాసాను పార్వతీ!'' అని కొడుకువైపు తిరిగి ''ఏరా మధూ! అదేదో కంపెనీలో అయిదువేలు డిపాజిట్ చేస్తే ఆ ఎకౌంటెంట్ పోస్టేదో ఇస్తారని అన్నావుటకదా! దానికి అప్లై చెయ్యరా! నా స్నేహితుడొకడిని వెళ్లి అడిగాను, జానకి పెళ్లికి, నీ డిపాజిట్‌కి ఏర్పాటు చేస్తానన్నాడు'' అన్నాడు భార్యా, బిడ్డల ముఖాల్లోకి చూస్తూ వెయ్యి కేండిల్సు బల్బు ఒక్కసారి వెలిగినంత కాంతి భార్యా, బిడ్డల

## అసమర్ధుని సమర్థత

ముఖాల్లో చూడగానే ఎంతో తృప్తి కలిగింది సుందర్రామయ్యగారికి

కొడుకు తనకి రాబోయే ఉద్యోగం గురించి తల్లితో సంతోషంగా చెప్పేస్తున్నాడు కూతురు తనకి కాబోయే భర్త గురించి ఆనందంలో తేలిపోతున్నట్లు ఇటూ, అటూ తెగ హడావిడిగా తిరిగేస్తోంది కొడుకు పెద్ద ఉద్యోగస్తుడయిపోయినట్టు, కూతురి పెళ్ళిపన్లు ప్రారంభించేసినట్టు ఏదో హడావిడిగా ఏవేవో మాట్లాడేస్తోంది పార్వతి ఇంట్లో వాళ్ళందర్నీ ఇన్నాళ్ళకయినా ఆనంద పర్చగలిగానని తృప్తిగా నిట్టూర్చాడు సుందర్రామయ్యగారు.

ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టడంలేదు ఏమిటో అశాంతి, ఆందోళన, భయం, ఖంగారు లేచి పడక్కుర్చీలో పడుకుని గడియారం వంక చూసాడు యధాప్రకారంగా సెకన్లని నిమిషాలుగ, నిమిషాలని గంటలుగ మారుస్తూ టిక్, టిక్, టిక్ మంటు ఓ డిస్కో నాట్యకత్తె నడుం వూపినట్లు పెండ్యులంని ఇటూ, అటూ ఊపుతూ 'నాకు నీతో ఏం నిమిత్తం లే'దన్నట్లు తన పని తాను చేసుకుపోతోంది

''నీకు నాతో నిమిత్తం లేదూ? విశ్వాస ఘాతకురాలా!'' అంటూ చీదరింపుగా దానివైపు చూసి ''నా వాళ్ళంతా స్వార్ధపరులు నేను ఏమీ చెయ్యలేనప్పుడు నిందించి, నన్ను దోషిలా నిలబెట్టి, ''ఇది నీ కర్తవ్యం శక్తిలేకపోయినా, చెయ్యలేకపోయిన చెయ్యకతప్ప''దని నన్ను నిలదీసి చెప్పారు మరి నువ్వో!

ఏయ్! కాస్త నీ కాలాన్ని ఆపు చెయ్యలేవూ? ఇంకా ఎందుకా పరుగు? ఎందుకా ఖంగారు, రోజుకన్నా నీ కెందుకో ఈ రోజు మరీ పెరుగెక్కువయినట్లుందే! దుష్టురాలా! దుర్మార్గురాలా! నా ఉసురు నీకే తగుల్తుంది'' అని తిడుతున్నా విననట్లు, టంగ్, టంగ్, టంగ్ మంటూ నాలుగు సార్లు గంటల్ని కొట్టింది

వెన్నుమీదెవరో చరిచినట్లయి వులిక్కిపడ్డాడు ''ఆగు!'' అన్నాడు వణుకుతున్న పెదాలతో కసిగా గడియారంతో ఆగలేదు సైగా ''నేను ఆగినా గతించిన ఏ ఒక్క క్షణమూ వెనక్కి రాదుస్మీ!'' అంటూ వయ్యారంగా ఇటూ అటూ ఊపుకుంటూ వెక్కిరించినటు ఇంకో నిమిషం ముందుకి నడిచింది

''ఇన్నాళ్లు నేనందరికీ లోకువ, నువ్వు నాకు లోకువ అనుకున్నాను కానీ నీకూ నేను లోకువేనే!'' అనుకుంటూ విరక్తిగా లేచి పిల్లలున్న గదిలోకి వెళ్ళేడు పట్టెమంచంమీద కొడుకు, క్రింద పరుపు మీద కూతురు నిద్రపోతున్నారు వారి ముఖాల్లో ఏదో చెప్పలేని ఆనందం ఆ నిద్రలోకూడా స్పష్టంగా గోచరిస్తోంది సుందర్రామయ్యకి తృప్తిగా నిట్టూర్చి దొడ్లోకెళ్ళాడు

నూతి వగ్గిర ముఖం కడుక్కుంటోన్న భర్తనుద్దేశించి ''ఇంత పెందరాళ్ళే లేచారేమండీ!'' అంది అప్పుడే లేచొచ్చిన పార్వతమ్మ

''కడుపు నొప్పిగా వుందే అలా కాలవడ్డుకి వెళ్ళొద్దామని'' అంటూ తువ్వాలు భుజాన్నేసుకుని, చెప్పులు తొడుక్కుని బైటికెళ్ళబోతూ ఓ క్షణం ఆగి, గోడనున్న గడియారం పెండ్యులం పట్టుకుని ఆపేసాడు ''ఇంక నోరు మూసుకుని పడుండు నాలా మరెవ్వరి జీవితాల్లోను ఇలా పరిగెత్తి ఏడిపించక'' అంటూ వెళ్ళిపోయాడు


గుంపుగా తమ ఇంటి వైపుకే వస్తున్న జనాన్ని ఆశ్చర్యంగా చూడసాగింది వాకిట్లో ముగ్గు పెడుతున్న పార్వతమ్మ

''పార్వతమ్మగారూ! మన మేష్టారుగారు రైలుక్రింద పడ్డారండీ! పాపం పట్టాలు దాటబోతుంటే మాయదారి రైలొచ్చి ఆయన్ని పొట్టనెట్టుకుందండి!'' అని చెప్తున్న మాటల్ని విని కుప్పలా కూలిపోయింది క్షణంలో ఇల్లంతా శోక సముద్రంలా తయారయింది పోలీసువారి లాంచనాలన్నీ అయ్యాక, కొడుకు దహన సంస్కారాలు ముగించాడు తంతులన్నీ ముగుస్తున్నాయి

మొదటి రోజున్న దుఃఖం మర్నాడులేదు ఆ రోజుకన్నా మర్నాడు మరికొంచెం తక్కువన్నట్లు రోజు రోజుకు తగ్గుకొస్తున్న దుఃఖంతోపాటు ఆ తల్లీ, బిడ్డల మధ్య అసంతృప్తి పెరగసాగింది

''ఆ మాయదారి కడుపునొప్పి ఆనాడే వచ్చి కాలుజారి రైలుక్రింద పడాలా? మన ఖర్మ కాకపోతే'' అని పార్వతమ్మ లోలోన వాపోతుంటే, ''ఆ అప్పేదో తెచ్చి నాకు డిపాజిట్ కట్టేసినా బాగుండేది!'' అని మనసులో బాధపడుతూ, పైకిమాత్రం ''ఆ అప్పు ఎవరిస్తానన్నారో! ఏమిటో ఏదీ చెప్పలేదు చెప్పినా వెళ్ళి వాళ్ళని వేళ్ళా కాళ్ళాపడి బలిమాలి తేచ్చేవాడిని నా సంగతెలా వున్నా ఆ డబ్బుతో చెల్లాయి

టెక్కలి సాహిత్య సాంస్కృతీ సమాజంవారు ఇటీవల సన్నయ సాహిత్య సభ జరిపి ప్రముఖ రచయిత స్వామి చిరంతనానందగారికి సన్మానం చేశారు ఆ సందర్భంగా వేదికపై ప్రసంగిస్తున్న సమాజం అధ్యక్షుడు శ్రీ ఆర్ పద్మనాభరావు, స్వామి చిరంతనానంద, శ్రీ బి బి ఆర్ కృష్ణమూర్తిగార్లని చిత్రంలో చూడవచ్చు



# ఆసియా క్రీడోత్సవ పోటీలు



4౦0 మీటర్ల హర్డిల్స్ పోటీలో ఆసియా రికార్డును అధిగమించిన భారత మహిళ ఎం డి. వలసమ్మ





పై ఫొటో. ఆసియాడ్ మహిళల హాకీ ఫైనల్స్‌లో సింగపూర్‌ను 3-0 స్కోరుతో ఓడించిన భారతజట్టుకు ఎం పి శ్రీ రాజీవ్ గాంధి నవంబర్ 26 న స్వర్ణపతకాలు బహూకరించినప్పటి ఫొటో.

పెళ్ళి చేసి ఆ బాధ్యతనయినా ఒదుల్చుకుందు' నంటూ స్వార్థంతో, సానుభూతిగా జానకి వైపు చూస్తూ బాధపడ్డాడు మధు "ఇంక ఈ జన్మకి నాకు పెళ్ళేం అవుతుందిలే" అన్నట్లుగా మధువైపు విరక్తిగా చూసి బాధపడసాగింది జానకి

నోటి దగ్గర కూడు గద్ద తన్నుకుపోయినట్లు తమ, తమ సమస్యలు పరిష్కరించకుండానే సుందరామయ్య పోయాడన్న బాధ ఇంట్లో ముగ్గురికీ ఎక్కువవసాగింది.

ఇంట్లో సామాన్లతో పాటు సుందరామయ్య గారి పెట్టెతీసి ఆయన సామాన్లుకూడా సర్దుతున్నారు ముగ్గురు ఆయన పెట్టె అడుగున దళసరి కవరు కనిపించింది తీసి ఆశ్చర్యంగా చూడసాగారు.

అవి లైఫ్ ఇన్‌స్యూరెన్సు చేసిన కాగితాలు. "ఎప్పుడు చేసారీ ఇన్‌స్యూరెన్సు!" అనుకుంటూ చూసారంతా అంతకి కొద్ది రోజుల క్రితమే సుందరామయ్యగారు తన జీవితాన్ని ఇరవై వేలకి ఇన్స్యూర్ చేయించుకున్నాడు. దానితోపాటు పార్వతమ్మ పేర ఓ చీటి వ్రాసివుంది

"పార్వతి! భార్యగా నీకుగానీ, కన్నందుకు బిడ్డలకిగానీ కనీసావసరాలని తీర్చలేని అభాగ్యుడిని బ్రతికుండి మిమ్మల్ని సుఖపెట్టలేని అసమర్థుడినని నిరూపించుకున్నాను. కనీసం చచ్చి అయినా మిమ్మల్ని సంతోష పరచాలని, తృప్తి పరచాలని నా మనస్సు కోరుకుంది. అందుకే నేను సాహసించి ఈ పని చేసాను ఈ డబ్బు రాగానే మధుకి అయిదువేలిచ్చి, ఆ కంపెనీలో డిపాజిట్ కట్టుకుని ఉద్యోగం వేయించుకోమని చెప్పు. జానకీకి ఎనిమిదివేలు కట్నమిచ్చి రెండువేలు ఖర్చుచేసి పెళ్లి చెయ్యి మిగిలిన అయిదువేలూ నీ పేర్ని వుంచుకో! నన్ను కట్టుకున్నందుకు నీకు ఇంతకంటే ఎక్కు వేం చెయ్యలేకపోయాను పార్వతీ! నన్ను క్షమించు మీ ఆనందాన్ని పంచుకోడానికి నేనుండను. ఇది చూసిన వెంటనే వెళ్లి డబ్బు తెచ్చుకుని నేను వ్రాసిన ప్రకారం చెయ్యండి అదే నా ఆత్మకి శాంతి. బ్రతికుండి ఏమీ చెయ్యలేని అసమర్థుడిననిపించుకున్న నేను, చచ్చయినా సమర్థుడిననిపించుకున్నానన్న తృప్తి మిగలాలంటే నా కోరికని తీర్చండి. మీతో ఈ డబ్బు విషయాన్ని చెప్పే ధైర్యం నాకు దేముడివ్వ లేదు నా చిన్ననాటి నేస్తంలా, నా తోడబుట్టిన దానిలా చూసుకున్న నా గడియారంతో మాత్రం మూగగా నా వ్యధనంతా చెప్పుకునేవాడిని. ఆ గడియారం జాగ్రత్త — వుంటా" అని వ్రాసిన చీటీని చదివి అచేతనుల్లా కూలబడిపోయారు

సుందరామయ్యగారు వ్రాసిన ఆఖరి వాక్యం గుర్తొచ్చి అంతా ఒక్కసారి గోడనున్న గడియారం వైపు చూసారు. తండ్రి ఇంట్లోంచి వెళ్లిపోయిన టైము దగ్గరే ఆగిపోయి ఆయన చావుని గుర్తు చేసింది తండ్రిలేని లోటూ, భర్తపోయిన దుఃఖం వారిలో ఒక్కసారి పెల్లుబికి, ముగ్గురూ నిజంగా ఘొల్లుమన్నారు.

ఆ దుఃఖంలోనే లేచివెళ్లి తండ్రి అపురూపంగా చూసుకున్న ఆ గడియారానికి జాగ్రత్తగా కీ ఇచ్చి, ఆప్యాయంగా దుమ్ము దులిపి టైము సరిచేసాడు మధు. ★